## క్లుప్తంగా

### ఉచిత యోగా శిక్షణ

అయిజ: పట్టణంలోని అంబాభవాని ఆలయం లోని కమిటీ హాల్లో మంగళవారం నుంచి నిర్వహించనున్న ఉచిత యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని శిక్షణ గురువు శివానంద గురూజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 నుంచి 24 వరకు ఉదయం, సాయంత్రం 5.45– 7.15 గంటల వరకు ప్రతిరోజు రెండు తరగతులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. వివరాలకు 83749 14319ను సంప్రదించాలని సూచించారు.

### ఎమ్మెల్యే పరామర్శ



అలంపూర్: ఎమ్మెల్యే విజయుడు సోమవారం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉండవెల్లి మండలం పుల్లూరుకు చెందిన మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్ మాతృమూర్తి నాగలక్ష్మమ్మను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రెడ్డి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

### భాగవత సప్తాహ మహోత్సవం



ఇటిక్యాల: మండల పరిధిలోని శివనంపల్లి పాండురంగస్వామి ఆలయంలో గ్రామ కమిటీ సభ్యుల సహకారంతో విశ్వహిందూ పరిషత్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో సోమవారం భాగవత సప్తాహ మహోత్సవం నిర్వహించారు. ప్రతి మనిషికి లౌకిక ఆనందం తాత్కాలిం మాత్రమేనని నిజమైన ఆనందం భాగవత ప్రవచనం ఆలకించడము ద్వారానే అనుభవమవుతుందని వారు అన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### రైతు సంక్షేమంతోనే దేశాభివృద్ధి



కేటీదొడ్డి: రైతు సంక్షేమంతోనే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ధన్‌ధాన్య కృషి యోజనలో భాగంగా మన జిల్లాకు స్థానం దక్కడంతో సంతోషంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు భీంరెడ్డి, రాములు, దేవేందర్‌రెడ్డి, అశోక్, కృష్ణకాంత్, ముంగిలి వీరేష్ పాల్గొన్నారు.

### అభ్యసన సామర్థ్యాల పరిశీలన



ధరూరు: మండల పరిధిలోని ర్యాలంపాడు ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఎంఈఓ రవీంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ముఖ్యంగా ఎఫ్ఆర్ఎస్ 100 శాతం పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### రహదారిపై గుంతల పూడ్చివేత

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నెలో గద్వాల–రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గుంతలను సోమవారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకుడు వన్నప్ప సొంత ఖర్చులతో మట్టిని పూడ్చించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు గుంతలమయం కావడంతో నిత్యం వాహనదారులు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మప్ప, వీరన్న తదితరులు పాల్గొన్నారు.





ఇటిక్యాలలో మిరప పంటలో నిలిచిన వర్షంనీరు



శివనంపల్లిలో పూర్తిగా దెబ్బతిన్న కంది పంట

# రైతుల ఆశలు ఆవిరి

- వర్షాలతో దెబ్బతిన్న పంటలు
- అధిక పెట్టుబడులతో అప్పులపాలు
- చేతికొచ్చిన పంట నేలపాలు

ఇటిక్యాల: రైతులను అధిక వర్షాలు నిండా ముంచాయి. అంకుర దశలోనే ఆశలను మోడు చేసింది. పెట్టుబడులు నేలపాలు చేసి అన్నదాత ముఖంలో తీవ్ర నిరాశ నింపింది. గతంలో పత్తి, కంది, మిరప పంటలకు గిట్టుబాటు లేక అప్పులు పాలయ్యారు. నేడేమో అధిక వర్షాలు పంట చేతి కందక మునుపే చిదిమేసిందని మండలంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**20 వేల ఎకరాల్లో సాగు**

మండలంలోని షాబాద్, ఉదండాపురం, చాగాపురం, మునగాల, సాతర్ల, పెద్దదిన్నె శివనంపల్లి, బుడ్డారెడ్డిపల్లి, వావిలాల తదితర గ్రామాల్లో సుమారు 15,500 ఎకరాల్లో పత్తి, కంది 3,820, మిరప 2,850, వరి 1,200 ఎకరాల్లో సాగు చేపట్టారు. అదే విధంగా సుమారు 150 ఎకరాల వరకు కూరగాయలు సాగు చేపట్టారు.

**ఎకరాకు రూ.లక్షకు పైగా ఖర్చు**

ఎకరా మిరప సాగుకు రూ.లక్షల్లో పెట్టుబడి ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. విత్తు రూపంలో రకాన్ని బట్టి ఎకరాకు రూ.10– 15 వేలు వస్తుంది. నాటుకు రూ.5 వేలు, ఎరువులకు రూ.5 వేలు,



చాగాపురంలో వాడిపోయిన పత్తి

దుక్కికి రూ.4 వేలు ఖర్చు వస్తుందన్నారు. అంతేగాక గుంటక పొసేందుకు, కలుపు మొక్కల నివారణకు రూ.10 వేలు వ్యయం అవుతోంది. ఇక మందుల పిచికారీకి ఎకరాకు ఒక్క దఫాకు రూ.3 వేలు వెచ్చించాల్సి ఉంది.

**అపార నష్టం**

ఇటీవల కురిసిన వర్షాలు మిరప, పత్తి, కంది రైతులకు తీరని బాధను మిగిల్చాయి. మండలంలో అధికంగా కంది, పత్తి, మిరప పంటలు దెబ్బతిన్నట్లు రైతులు పేర్కొంటున్నారు. సుమారు సెప్టెంబర్ నెల వరకే అధికారుల అంచనాల ప్రకారం సుమారు 140 ఎకరాల్లో పంట నష్టం సంభవించినట్లు నివేదికల్లో నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల కురిసిన వర్షాలతో పంట నష్టం ఇంకా పెరగొచ్చని అధికారులు పేర్కొంటున్నారు. వర్షాలతో పంట పొలాల్లోకి నీళ్లు చేరడంతో మొక్కలు కుళ్లి చనిపోయాయి. కాయ పట్టే దశలోనే మొక్కలు ఎండిపోయాయి. మొన్నటి వరకు కళకళలాడిన పైరు నేడు మోడుబారాయి. ముఖ్యంగా సాతర్ల, ఇటిక్యాల, శివనంపల్లి, ఉదండాపురం గ్రామాల్లో పంటలు అధిక మొత్తంలో దెబ్బతిన్నట్లు రైతులు వాపోతున్నారు.

**పెట్టుబడి రావడం కష్టం**



ప్రస్తుతం 5 ఎకరాల్లో పత్తి పంట సాగు చేపట్టాను. ఇటీవల కురిసిన వర్షాలతో పంట బాగా దెబ్బతింది. దీనికి తోడు పంట పెట్టుబడి కూడా ఎక్కువైంది. ఎప్పుడు ఇంత నష్టం రాలేదు. పెట్టుబడి కూడా వచ్చేది కూడా కష్టంగా ఉంది.

– కుర్వ చిన్నరామకృష్ణ, చాగాపురం

**అప్పు తీర్చలేం**



ప్రసుత్తం 6 ఎకరాల్లో మిరప పంట సాగు చేపట్టా ను. ఇప్పటికీ రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టాం. పంట చేతికందే దశలో వర్షాలు పడటంతో పంట నాణ్యత కూడా రావడం లేదు. అప్పులు తెచ్చి పంట సాగు చేస్తే ఇప్పు తీర్చే మార్గం కనిపించడం లేదు.

– లక్ష్మీనారాయణ, ఇటిక్యాల

**నివేదికలు పంపించాం**



మండలంలో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలను గ్రామాల్లో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు నమోదు చేశారు. దెబ్బతిన్న పంటలను గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు పంపించాం.

– రవికుమార్, ఏఓ

## సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలి

గట్టు: ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఏస్‌టీ (సొసైటీ ఆఫ్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్) స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ అశోక్ అన్నారు. సోమవారం మాచర్ల గ్రామంలో ఎస్ఎస్‌టీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక భద్రతా పథకాలు పీఎంఎస్‌వై(ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన), పీఎంజేజేబీవై(ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన), ఏపీవై(అటల్ పెన్షన్ యోజన)లో తప్పని సరిగా చేరి ఆర్థిక భద్రతను పొందాలని కోరారు. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు ఖాతా, వ్యక్తిగత వివరాలను ఇతరులకు ఇవ్వకుండా



అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

జాగ్రత్త వహించాలన్నారు. మోసపూరిత ప్రకటనలను నమ్మవద్దన్నారు. సైబర్ మోసాల బారిన పడితే తక్షణమే 1930కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు అనూష, ప్రకాష్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల కోసమే బీసీ రిజర్వేషన్ల డ్రామా



మాట్లాడుతున్న బీజేపీ వడ్డేపల్లి అధ్యక్షుడు నాగరాజు

శాంతినగర్: బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుచూస్తే ఓట్ల కోసం డ్రామా ఆడుతున్నారని బీజేపీ వడ్డేపల్లి మండల అధ్యక్షుడు నాగరాజు ఆరోపించారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలు ఇచ్చి అమలు చేయలేక బీసీల రాగం పాడుతోందన్నారు. ప్రజల వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తెరపైకి తెచ్చిందన్నారు. బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని, లేని పక్షంలో బీసీల ఆగ్రహానికి కాంగ్రెస్ ప్రభుత్వం గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఏలియా, యాకోబ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## నీళ్లు పోయకుండానే నిధుల డ్రా

కేటీదొడ్డి: జాతీయ ఉపాధి హామీ పథకంలో నాటిన మొక్కలకు నీరు అందించే ట్యాంకర్ బిల్లులు కాజేసిన వారిపై చర్య తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఉమిత్యాల గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులపై నిర్వహించిన సోషల్ ఆడిట్ బృందానికి ట్యాంకర్ పేమెంట్ నిధులు పక్కదారి పట్టాయంటూ ఆరోపిస్తూ గ్రామస్తులు పలువురు ఫిర్యాదు చేశారు. జాతీయ ఉపాధి పథకంలో 2024– 25 సంవత్సరంలో ఉమిత్యాల గ్రామాల్లో ఉపాధి పథకంలో భాగంగా మొక్కలు నాటారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా ట్యాంకర్ల ద్వారా నాటిన మొక్కలను నీళ్లు పోయాలి కానీ పంచాయతీ కార్యదర్శి, సీనియర్ మేట్, టెక్నికల్ అసిస్టెంట్లు వర్క్ ఐడీ నంబర్ 7231173958 పేరిట, రూ.22,536, వర్క్ ఐడీ 7231094512 పేరిట రూ.73,110 వర్క్ఐడీ 23626 పేరిట 52,32 ఎంబీలు చేశారు. మొత్తం రూ.1.47 లక్షల పైగా నిధులు కాజేసినట్లు పేర్కొన్నారు. నిధులు దుర్వినియోగం చేసిన వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### సైబర్ మోసగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

అమరచింత: సైబర్ మోసగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ స్వాతి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం సైబర్ నేరాలు, బాల్య వివాహాలతో పాటు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అపరిచిత లింక్‌లు ఓపెన్ చేయకూడదన్నారు. వ్యక్తిగత వివరాలు ఎవరికి చెప్పవద్దని సూచించారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను పాటించాలన్నారు. ట్రాలీ ఆటోల్లో పరిమితికి మించి కూలీలను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

అయిజ: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం అయ్యప్ప మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులు స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### విద్యుత్ సరఫరాకు అంతరాయం

అయిజ: నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించేందుకు చేపట్టిన మరమ్మతులో భాగంగా మంగళవారం మండలంలోని ఉప్పల, ఉప్పల క్యాంపు గ్రామాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నీలి గోవిందు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి వెళ్లే 33 కేవీ వెంకటాపురం ఫీడర్‌కు సంబంధించిన విద్యుత్ వైర్లపై చెట్లకొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో 3 గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరా యం ఉంటుందన్నారు. కావునా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

### పరిమితికి మించి తరలించొద్దు



ఇటిక్యాల: ఆటోడ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులు, కూలీలను తరలించ వద్దని ఎస్ఐ రవినాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మునగాల శివారులో అధిక మొత్తంలో కూలీలను తరలిస్తున్న ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. పరిమితికి మించి ప్రయాణిస్తున్న 5 ఆటోలకు రూ.10 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పొలాలకు దారి ఏర్పాటు చేయాలి

ఉండవెల్లి: మండలంలోని తక్కశీల, జల్లాపురం గ్రామాల మధ్య ఉన్న పంట పొలాలకు దారి లేదని రైతులు తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీఓ తిరుపతన్నకు రైతులు సోమవారం వినతిపత్రం అందజేశారు. దారి లేక కూలీలు, వాహనాలు రావడం లేదన్నారు. అధికారులు చొరవ తీసుకుని రోడ్డును నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సవరయ్య, స్వాములు, నర్సన్‌గౌడ్, బాషా, నరేష్ పాల్గొన్నారు.



## గెలుపే లక్ష్యంగా కృషి చేద్దాం



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులతో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

అలంపూర్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేద్దామని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎస్ఏ సంపత్‌కుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయిజ మండలానికి చెందిన భూంపురం నరసింహారెడ్డి, ఉప్పల తిప్పన్న, కురువ రమేష్, ఆలయ కమిటీ మాజీ ధర్మకర్త రంగన్నగౌడ్, మాజీ సర్పంచ్ కురువ నాగేంద్ర, బోయ ఆంజనేయులు, నాగేంద్ర తదితరులకు సంపత్‌కుమార్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ దొడ్డెప్ప, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి, నాయకులు ప్రకాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయానికి ప్రహరీ నిర్మించండి



ఈఓకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అలంపూర్: శ్రీలక్ష్మీనరసింహ్మాస్వామి ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మించాలని బీజేపీ నాయకులు కోరారు. శ్రీజోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ ఈఓ దీప్తికి సోమవారం వినతిపత్రం అందజేశారు. శ్రీలక్ష్మీనరసింహ్మ స్వామి ఆలయం చుట్టు ఉన్న ప్రహరీ కూలిపోగా మరమ్మతు లేదా నూతన గోడ నిర్మించాలని కోరారు. అదే విధంగా ఆలయంలో నిత్య పూజలు, భక్తులకు ప్రసాదాలు అందించాలని వినతిలో పేర్కొన్నారు. గాంధీచౌక్ నుంచి ఆర్డీఎస్ కార్యాలయం వరకు డివైడర్ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ లైట్స్‌కి పైన జోగుళాంబ అమ్మవారి బాలబ్రహ్మేశ్వరస్వామి వారి గ్లోబ్ లేదా సింబల్ పెట్టాలని కోరారు. ఈఓ సానుకులంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శరత్‌బాబు, రంగస్వామి, నరేష్, లోక్‌నాథ్ పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి



మల్దకల్ హైస్కూల్‌లో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

మల్దకల్: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ విద్యార్థులకు సూచించారు. సోమవారం స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో వికసిత్ భారత్ బిల్డథాన్ ప్రత్యక్ష కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా దేశంలో ఆవిష్కరణలను బలోపేతం చేయడంతో పాటు యువతను వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వామ్యం చేయడానికి ప్రవేశపెట్టినట్లు తెలిపారు. 6 నుంచి పదో తరగతి వరకు బిల్డథాన్ రూపొందించారన్నారు. వికసిత్ భారత్– 2047 వరకు భారతదేశాన్ని అభివృద్ధి రంగంగా మార్చేందుకు రూపొందించిన సమగ్ర పథకం వికసిత్ భారత్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాతికేళ్లయినా రోడ్డు బాగు చేయలే..



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చెన్నిపాడు యువకులు

గద్వాల: భారత్‌మాల రోడ్డులో భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం డబ్బులు ఇప్పించాలని గట్టు, గంగిమాన్‌దొడ్డి, సల్కాపురానికి చెందిన రైతులు కలెక్టర్ బీఎం సంతోష్‌ను కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. రెండో విడత రావాల్సిన డబ్బులు ఇంకా రాలేదని దీనిపై అధికారులను పలుమార్లు సంప్రదించినా స్పందించడం లేదన్నారు. పరిహారం డబ్బులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో భీమ్ ఆర్మీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మాచర్ల ప్రకాష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**ఆస్పత్రి అందుబాటులోకి తేవాలి**

అయిజలోని వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని బీఆర్ఎస్వీ నాయకులు కుర్వ పల్లయ్య కోరారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఫిర్యాదుల దినోత్సవంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

**మరమ్మతు చేయాలని వినతి**

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గుండా మా నవపాడుకు వెళ్లే రహదారి గుంతలతో ప్రమాదకరంగా ఉందని బీజేపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, భాస్కర్, వీరేష్ సోమవారం కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతిపత్రం అందించారు. బీటీరోడ్డు పరిస్థితి దయనీయంగా ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గుంతల రోడ్డుతో వాహనదారులు, ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

**న్యాయం చేయాలని ఫిర్యాదు**

ధరూరు: సీడ్‌పత్తి సాగుచేసినందుకు చెల్లించాల్సిన డబ్బులు ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్న సబ్ ఆర్గనైజర్‌పై చర్య తీసుకోవాలని గుడ్డెందొడ్డి రైతులు కలెక్టర్ బీఎం సంతోష్‌కు ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు.. గ్రామానికి చెందిన ఓ ఆర్గనైజర్ ద్వారా కొన్నేళ్లుగా సీడ్‌పత్తిని సాగు చేస్తున్నామని, గతేడాది సాగుచేయగా రావాల్సిన డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నట్లు తెలిపారు. డబ్బులు చెల్లించకుండా బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

**అవినీతిని వెలికితీయండి**

శాంతినగర్: కొంకల గ్రామానికి మంజూరైన 48 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, బిల్లుల చెల్లింపులో అవినీతి జరిగిందని, అనర్హులకు మంజూరు చేశారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన కె.మహేశ్వరమ్మ ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తన పురాతన ఇళ్లు కూలిపోయిందని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కలెక్టర్ సంతోష్‌కు ఫిర్యాదు చేశారు. తనకు ఇళ్లు మంజూరు చేయాలని ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదన్నారు. అంతేగాక ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో నాయకులు, కార్యకర్తలు, అధికారులు చేతివాటం ప్రదర్శిస్తూ పైసలు ఇచ్చిన అనర్హులకు ఇళ్లు మంజూరు చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై కొంకలకి వచ్చి లబ్ధిదారులకు మంజూరైన ఇళ్లను తనిఖీ చేసి, అర్హత లేకున్నా ఇళ్లు మంజూరు చేసిన వారిపై చర్య తీసుకోవాలని పేర్కొన్నారు.

### హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

గద్వాల: ప్రభుత్వ వసతి గృహాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రవీణ్ కోరారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని గంజిపేట ప్రభుత్వ సాంఘీక సంక్షేమ బి హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేయించారు. కార్యక్రమంలో భరత్, కరుణాకర్, అంజి పాల్గొన్నారు.

## రహదారులకు హరిత తోరణాలు



పెద్దపల్లి- బూడిదపాడు రహదారిలో..



మద్దెలబండ- మల్దకల్ రోడ్డులో ..

రహదారులకు తోరణాల్లా పచ్చని చెట్లపై కొమ్మలు వాహనదారులను ఆహ్లాద పరుస్తున్నాయి. గట్టు-మల్దకల్ దారిలో మద్దెలబండ సబ్‌స్టేషన్ దాటిన తర్వాత 500 మీటర్ల మేర, గద్వాల అయిజ దారిలో పెద్దపల్లి- బూడిదపాడు, అదే విధంగా ఆలూరు- రాయాపురం స్టేజీ వరకు దారిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పచ్చని చెట్ల కొమ్మలు ఒకదానికొకటి కలుసుకొని అబ్బురపరుస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెట్లు దట్టంగా పెరిగి దారుల గుండా వెళ్తున్న వాహనదారులు, ప్రజలకు అందమైన అనుభూతిని కల్గిస్తున్నాయి.

గట్టు